# హిందీ పాఠం

పాతికేళ్ల వయసున్న బెంగాలీ అమ్మడు మాకు ఆఫీసులో హిందీ పాఠాలు చెప్పడానికి వచ్చింది. ఒకరోజు నేను వ్రాసిన పది వాక్యాలు దిద్ది, లైనుకు రెండు తప్పులు చూపించి నన్ను గట్టిగా దులిపేసింది.

"భూమి స్త్రీలింగం, ఆకాశం పుల్లింగం, కాగితం పుల్లింగం, కలం స్త్రీ లింగం, పాలు పుల్లింగం, చాయ్ స్త్రీ లింగం, ప్రతీ నామవాచకమూ ఏ లింగమో తెలియకుండా వాక్యంలో ఉపయోగిస్తే క్రియారూపం తప్పయి వాక్యం చెడిపోతుంది" అని కళ్లు వింతగా తిప్పుతూ భయపెట్టేసింది. 'ఎంచక్కా తెనుగు భాషలో ఈ బాధ లేదుకదా! చాయ్, కాఫీ, రాయీ, రప్పా, అగ్గిపెట్టె, సబ్బుబిళ్లా అన్నిటినీ ఒకేవిధంగా గౌరవించవచ్చు' అనుకున్నాను మనసులో.

ఆ సాయంత్రం ఇంటికి వచ్చాను. నా టేబుల్‌మీద ఒక కార్డు వుంది. "అన్నీ సీరియస్ కథలే వ్రాయకపోతే కాస్త తేలిక కథలు వ్రాయకూడదా మాస్టారూ!" అని ముగించిన ఉత్తరంలో చివర "మీ అభిమాని - రత్నం" అని క్లుప్తంగా వుంది. నాకు వేడి టీ తెస్తూ నా భార్య రేవతి "మీ అభిమానుల్లో రత్నాలూ, మాణిక్యాలూ వున్నట్లు నాకు తెలియదే మాస్టారూ" అని ఎదురైంది. కార్డు ఎక్కడనుండి వచ్చిందో అని చూశాను. మా ఊరినుండే. తేలికగా నవ్వి "నేను మా ఊరి హైస్కూల్లో ఒక ఏడాది టీచరుగా వెలగబెట్టాను. రత్నం అంటే రత్నాకర్రావుగాడు. నా శిష్యుడు. వాడికి నేనంటే వెర్రి అభిమానం" అన్నాను. రేవతి నా మాట నమ్మిందో లేదో నాకు తెలియదు కానీ అప్పుడు నాకు స్ఫురించింది- తెనుగువాళ్లు పెట్టుకునే పేర్లు కూడా కొన్ని ఏ లింగమో చెప్పకుండా తికమకపెడ్తాయని! పైడితల్లి, నాయుడమ్మ, రత్నం - ఇలాంటివే.

ఆ తరువాత ఏదో ఆఫీసు పనిమీద మద్రాసులో రెండురోజులూ, బొంబాయిలో మూడురోజులూ వుండి హైదరాబాద్ వచ్చాను. మద్రాసులో ఒకరోజు సిటీబస్సు ఎక్కి బస్సుకి ఎడమవైపు వరుసలోని ఒక సీట్లో కూర్చున్నాను. నా వెనక వరుసలో ఒక మహిళ నన్ను వింతగా చూసింది. ఇంతలో కుడి వేపు వరుసలో కూర్చున్న ఒక పెద్దమనిషి అచ్చ

తెలుగులో "మద్రాసుకి కొత్తవారులా వున్నారు. ఇటురండి. ఆ సీట్లు ఆడవారికి ప్రత్యేకం" అన్నాడు. ఈ అనుభవంతో నేను బొంబాయి వెళ్లి సిటీ బస్సు ఎక్కినప్పుడు కాస్త సందేహించి నిలబడ్డాను. "దారి కడ్డుగా నిలబడడం దేనికీ- అక్కడ సీటు కాళీగా ఉంది కూర్చోరాదూ" అన్నాడు కండక్టరు హిందీలో విసుగ్గా. ఆ కాళీ సీటు పక్కనున్న స్త్రీని చూస్తూ బిక్కుబిక్కుమని సందేహిస్తూ కూర్చున్నాను. ఆమె స్నేహపూర్వకంగా "మీది హైదరాబాద్ అనుకుంటాను. ఇక్కడ స్త్రీలకు ప్రత్యేకంగా సీట్లు లేవు" అని నా సందేహాన్ని అర్థంచేసుకొని నెమ్మదిగా చెప్పింది. ఆమెకు కృతజ్ఞత చెప్పుకుంటూ 'సిన్ ఈజ్ జియ్రాఫికల్' అన్న బెర్ట్రండ్ రస్సల్ వాక్యం జ్ఞాపకం చేసుకున్నాను. ఎందుకంటే హైదరాబాద్‌లో నేను పొరపాటునైనా మొదటి ఐదు వరుసల్లో కూర్చుని ఎరగను. కాసింత పరాకుపడి కాళీగా వుందని కూర్చుంటే ఏ కాలేజీ అమ్మాయో తరువాత నిలబెట్టి క్లాసు తీసుకుంటుంది. లేదా ఏ ఇన్‌స్పెక్టరో వచ్చి బస్సు దింపి ఫైన్ కట్టిస్తాడు.

ఇలా ఉండగా మొన్న ఆటోల స్ట్రైక్ రోజునే నా మరదలు రాకరాక భాగ్యనగరం చూస్తానని వచ్చింది. నేనూ, రేవతీ సిటీ బస్సు ఎక్కించి నాంపల్లినుండి ఇంటికి తీసుకుని వస్తున్నాం. బస్సురద్దీగా వున్నా లేడీస్ సీట్లున్న ఒక వరుసలో కిటికీ దగ్గర ఒక శాల్తీ మాత్రమే తలనిండా పూలు ముడుచుకుని కూర్చుంది. పక్కన రెండు సీట్లు ఖాళీగా వున్నాయి. వెంటనే రేవతినీ, మరదల్నీ కూర్చోమని అన్నాను. వాళ్లు కూర్చోబోయి సందేహించి ముసి ముసినవ్వులతో నిలుచుండి పోయారు. నాకు చిరాకు వేసింది. పోనీ ఇంకెవ్వరూ కూడా కూర్చోరెందుకూ అన్న అనుమానంతో అటు నిశితంగాచూశాను. సీటులో కూర్చున్న శాల్తీ నిశ్చింతగా సిగరెట్ తాగుతున్నాది (డు). అప్పుడర్థమైంది ఆడా మగా కూడా ఆ వ్యక్తిని ఎందుకు అంతగా గౌరవిస్తున్నారో హిందీ పాఠం గుర్తుకు వచ్చింది. ఆర్‌టిసీ నియమావళిలో ఈ శాల్తీ ఏ వర్గానికి చెందుతుంతో మరి! "చూడవలసిన వింతల్లో ఒకటి నా చెల్లెలు మొదటిరోజే చూసేసింది" అన్నది రేవతి బస్సు దిగుతూ నా చెవిలో.

జరిగినదంతా ఓ కథగా మలిచి కొంత చమత్కారం జోడించి ఒక పత్రికకుపంపాను. కథ అచ్చయిన వారంరోజులకు వచ్చింది మరో పోస్టుకార్డు. కథల్లో శిల్పం, శైలి, చమత్కారం ఉంటే ఉండనియ్యండి కానీ కథావస్తువు ఉదాత్తంగా ఉండొద్దూ? జన్యుకారణంగా సంక్రమించిన అవలక్షణాన్ని హేళనచేస్తూ కథ రాయడం అన్యాయం కాదూ? అని మందలించాడు రత్నం. రత్నం రత్నమే. ఆమాటకొస్తే రత్నాకరం.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక 27-11-1987)